TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 117 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శుక్రవారం.21.11.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




"శ్రీ కృష్ణ, కార్తికేయ,దత్తాత్రేయ,హనుమాన్ విగ్రహా ప్రతిష్టాపన మహొత్సవం
" తేదీ నవంబర్ 24,25,26, శ్రీ కిషన్ మహారాజ్ శ్రీ నవశక్తి దుర్గామాత మందిరం ఆదిలాబాద్

# దేశమంతా సన్నబియ్యం ఇవ్వండి

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణలో అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకం విజయవంతమైందనీ, దీన్ని దేశమంతా విస్తరింపచేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషికి సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామనీ, దీనివల్ల పీడీఎస్ బియ్యం రీ సైక్లింగ్ తగ్గి, బహిరంగ మార్కెట్లో ధరలు స్థిరపడ్డాయని వివరించారు. ప్రజలు తినే బియ్యాన్ని పంపిణీ చేయటంతో ఈ పథకం ఆశించిన లక్ష్యం నెరవేరిందని చెప్పారు. దీనిపై కేంద్రంమంత్రి ప్రహ్లాద్‌జోషీ స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీపై పూర్తిస్థాయి అధ్యయనం చేసి దేశవ్యాప్తంగా ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చేలా నిర్ణయం తీసుకుటుందని హామీ ఇచ్చారు. గురువారం హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషితో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఆయనతో పాటు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి స్టీఫెన్ రవీంద్ర తదితరులు ఉన్నారు.



ఈ సందర్భంగా రాష్ట్రానికి తగిన సహాయ సహకారాలు అందించాలంటూ సీఎం పలు అంశాలను కేంద్రమంత్రి వద్ద ప్రస్తావించారు. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కోటా పెంచాలని కోరారు. పీడిఎస్ కింద సరఫరా చేసిన లెవీ రైస్‌కు సంబంధించిన రూ.1,468 కోట్ల సబ్సిడీ విడుదల చేయాలన్నారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నయోజన (పీఎంజీకేఏవై) అయిదో దశకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.343.27 కోట్ల సబ్సిడీని కూడా విడుదల చేయాలని కోరారు. 2024-25 ఖరీఫ్ కస్టమ్ మిల్లింగ్ రైస్ వ్యవధి పొడిగించాలనీ, ఎఫ్‌సీఐ గోదాముల్లో నిల్వ ఇబ్బందులను అధిగమించేందుకు అదనపు బాయిల్డ్ రైస్ ర్యాక్‌లు కేటాయించాలని, రాష్ట్రంలో 15 లక్షల మెట్రిక్ టన్నుల గోదాముల నిల్వ సామర్థ్యం పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

2025-26 ఖరీఫ్‌లో అత్యధికంగా 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని 80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని కోరారు. ఈ డిమాండ్లన్నింటిపై కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషీ సానుకూలంగా స్పందించారు. త్వరలో వీటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్ అవసరం తగ్గిందనీ, అందువల్ల మిల్లింగ్‌కు అనువైన ముడి బియ్యం రకాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో మిగులు ధాన్యం నిల్వలను సమర్థంగా నిర్వహించేందుకు ఎగుమతి అవకాశాలను పరిశీలించుకోవాలని సూచించారు.

# ఫిజికల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: దేశంలోనే అత్యంత నివాసయోగ్య నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వీలైనంత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటుందని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎంను 'అనలాగ్ ఏఐ' సీఇఓ అలెక్స్ కిప్మన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిరువురూ పలు అంశాలపై చర్చించారు. ట్రాఫిక్, పట్టణ వరదలు, సరస్సుల రక్షణ, వాతావరణ అంచనా, పరిశ్రమల కాలుష్య నియంత్రణకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మార్గాలపై మాట్లాడుకున్నారు. 'ఫిజికల్ ఇంటెలిజెన్స్' ఆధారంగా రియల్ టైమ్ సెన్సార్ నెట్‌వర్క్, స్మార్ట్ సిటీ నిర్వహణ పద్ధతులపై పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాలనీ, దీనికోసం 8 వారాల శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. సీసీ టీవీ వ్యవస్థను రియల్ టైమ్ సిటీ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫారమ్‌గా మార్చడంతో పాటు ట్రాఫిక్, ప్రజా భద్రత, అత్యవసర సేవలన్నీ ఏఐ ఆధారిత అంచనాలతో ఒకేచోట సమన్వయం చేసి, ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి

ప్రత్యక్ష ప్రసారం ద్వారా నిర్వహణ చేపడతారు. ఈ సందర్భంగా డిసెంబర్ 8, 9 తేదీల్లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని సీఎం అనలాగ్ సీఈఓను ఆహ్వానించారు.

# అక్రమాస్తుల కేసులో సీబీఐ కోర్టుకు జగన్



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: అక్రమాస్తుల కేసులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం జగన్ సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి ఎదుట విచారణకు వచ్చారు. విజయవాడ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి అక్కడి నుంచి నాంపల్లిలోని కోర్టుకు ఆయన చేరుకున్నారు. విచారణ అనంతరం జగన్ అక్కడి నుంచి లోటస్‌పాండ్‌కు వెళ్లిపోయారు. మరోవైపు ఆ పార్టీ నేత పేర్ని నాని, మరో ముగ్గురు నేతలను కోర్టు లోపలికి పోలీసులు అనుమతించలేదు. దీంతో వారు గేట్ వద్దే నిలుచున్నారు. ఈ కేసులో 2013 సెప్టెంబర్ నుంచి జగన్ బెయిల్‌పై ఉన్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరగా సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేండ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదనీ, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సీబీఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు.

# రాష్ట్రపతి,గవర్నర్లకు గడువు విధించలేం



న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి రాష్ట్రపతి లేదా గవర్నర్లకు నిర్దిష్ట కాలపరిమితిని విధించలేమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. బిల్లులకు గవర్నర్లు ఆమోదం తెలిపే విషయంపై రాష్ట్రపతి లేవనెత్తిన 14 నిర్దిష్ట సందేహాలను ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం గురువారం నివృత్తి చేసింది. తద్వారా గవర్నర్లు, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న శాసన సంబంధమైన వివాదాలకు ముగింపు పలికింది. ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవారు మరో రెండు రోజులలో పదవీ విరమణ చేయనుండగా ఆయన నేతృత్వంలోని ధర్మాసనం రాష్ట్రపతి సంధించిన ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇచ్చింది. బిల్లుల ఆమోదానికి రాజ్యాంగ వ్యవస్థలపై కచ్చితమైన కాలపరిమితి విధించలేమని చెబుతూనే గవర్నర్లు బిల్లులను ఆమోదించకుండా వాటిని తమ వద్ద నిరవధికంగా అట్టే పెట్టుకోజాలరని స్పష్టం చేసింది. రాష్ట్రపతి లేవనెత్తిన వివిధ అంశాలపై సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యక్తం చేసిన అభిప్రాయాలు%ా

కారణం చెప్పాల్సిందే

'రాష్ట్ర శాసనసభలు ఆమోదించి న బిల్లులకు ఆమోదం తెలపడానికి గవర్నర్ అనుసరించాల్సిన రాజ్యాంగ బద్ధమైన ప్రక్రియను ఆర్టికల్ 200 వివరించింది. తన ముందుకు ఏదైనా బిల్లు వచ్చినప్పుడు గవర్నర్ మూడు మార్గాలను ఎంచుకోవచ్చు. బిల్లును ఆమోదించడం, రాష్ట్రపతి పరిశీలన కోసం దానిని రిజర్వ్ చేయడం, బిల్లును ఆమోదించకుండా తన వ్యాఖ్యలతో పున్ణపరిశీలన కోసం తిరిగి శాసన సభకు పంపడం. ఏ కారణం చూపకుండా బిల్లును నిరాకరిం చే అవకాశం లేదు. బిల్లుపై సంతకం చేసేందుకు నిరాకరించి దానిని పెండింగ్‌లో ఉంచకూడదు. బిల్లును ఆమోదించని పక్షంలో దానిని విధిగా తిరిగి సభకు పంపాల్సి ఉంటుంది.

# సౌదీ బస్సు ప్రమాదం తీవ్రంగా కలిచివేసింది



ముషీరాబాద్ :అమృత్ తెలంగాణ: సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం తనను తీవ్రంగా కలిచివేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బస్సు ప్రమాదంలో ప్రాణం కోల్పోయిన వారి కుటుంబాన్ని గురువారం హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సౌదీ దుర్ఘటనలో నసీరుద్దీన్ కుటుంబానికి చెందిన 18 మంది మరణించడం అత్యంత బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎటువంటి ఆర్థిక, సామాజిక సహాయం అవసరమైనా పార్టీ ద్వారా అందజేస్తామని బాధితులకు చెప్పారు. అలాగే, బాధిత కుటుంబ సభ్యులతో సౌదీకి వెళ్లిన బీఆర్ఎస్ బృందం.. అక్కడ వారికి అవసరమైన సహాయం చేస్తుందని స్పష్టం చేశారు. పరామర్శించిన

వారిలో ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ మంత్రి మహమ్మద్ అలీ ఉన్నారు.

# జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఘన స్వాగతం





నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కు స్వాగతం పలుకుతున్న నిర్మల్ జిల్లా ప్రజలు అధికారులు

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈ నెల 18వ తేదీన జరిగిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక "జల సంచయ్ - జన భాగీదారి" అవార్డును స్వీకరించి గురువారం కలెక్టరేట్ కు వచ్చిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు కార్యాలయం ప్రధాన గేటు వద్ద అధికారులు పూలమాలలు, బ్యాండ్ మేళాలతో ఘన స్వాగతం పలికారు. పలువురు అధికారులు కలెక్టర్‌కు పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో కలెక్టరేట్ ప్రాంగణం సందడిగా మారింది ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ స్థాయి జల అవార్డుల్లో భాగంగా దక్షిణాది రాష్ట్రాల విభాగంలో నిర్మల్ జిల్లా రెండవ స్థానంలో నిలవడం గర్వకారణమని అన్నారు. జిల్లాకు కోటి రూపాయల రివార్డు లభించడం విశేషమని తెలిపారు. అధికారుల సమిష్టి కృషి, ప్రజల విలువైన భాగస్వామ్యంతోనే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో పని చేసి, జిల్లాకు మరిన్ని ప్రతిష్టాత్మక అవార్డులు సాధించేందుకు

కృషి చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. జిల్లాకు ఇంతటి ప్రతిష్టాత్మక అవార్డు రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో పాటు అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలెక్టర్‌ను కలిసి పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా రిమ్స్ నుంచే అన్ని అవసరమైన వైద్య సేవలు అందించేలా సమర్థమైన ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి గురువారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో అపోలో, ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిన్నారుల ఉచిత గుండె జబ్బుల వైద్య శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. రిమ్స్‌లోని డీఈఐసి కేంద్రంలో హైదరాబాద్ అపోలో కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పీడియాట్రిక్ కార్డియాలజీ శిబిరానికి ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 150 మంది చిన్నారులు హాజరయ్యారు. వైద్యులు వారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి శస్త్రచికిత్సల నిమిత్తం హైదరాబాద్‌కు రావాలని సూచించారు. ఒక చిన్నారి తల్లి హైదరాబాద్‌లో పరీక్షలు చేయించుకుంటున్నట్లు తెలుసుకున్న కలెక్టర్, రిమ్స్‌లోనే అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని ఇక్కడే వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేద కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించేలా రిమ్స్‌లోనే వైద్య చికిత్సలు అందించాలని అన్నారు. వైద్య పరీక్షలు, మందులు, స్కానింగ్, 2డీ ఈకో వంటి సేవలు రిమ్స్‌లోనే అందుబాటులో ఉండే విధంగా



రిమ్స్ హాస్పిటల్ నందు తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పేదలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించేందుకు అపోలో ఆసుపత్రి ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. మందులు, స్కానింగ్ తదితర పరీక్షల కోసం పేదలపై భారం తగ్గేలా ప్రణాళికలు రూపొందించి, రవాణా ఖర్చులు మాత్రమే అయ్యే విధంగా హైదరాబాద్‌కు పంపేలా వ్యవస్థను రూపొందించాలని రిమ్స్ డైరెక్టర్‌కు సూచించారు. అవసరమైతే ఆసుపత్రి యాజమాన్యానికి లేఖ రాసి, రిమ్స్‌లోనే పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, వైద్యులు వై.సి. శ్రీనివాస్, సమీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్లకు గౌరవం లభిస్తే సమాజం మరింత అభివృద్ధి జిల్లా కలెక్టర్ రాజర్షి షా



సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



కలెక్టర్ ను సన్మానిస్తున్న డిసి సి.బి చైర్మన్ అడ్డి భోజ రెడ్డి


అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి సీనియర్ సిటిజన్లకు సముచిత గౌరవం లభించినప్పుడే సమాజం మరింత ప్రగతి సాధిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. వయోవృద్ధుల సంరక్షణ కోసం ప్రభుత్వం సీనియర్ సిటిజన్ యాక్ట్ ను తీసుకురావడం జరిగిందని, ఈ చట్టంపై విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వయోవృద్ధులు తమ పూర్తి ఆస్తిని పిల్లలకు ఇవ్వకుండా కొంత భాగాన్ని తమ భద్రత కోసం ఉంచుకోవాలని సూచించారు. పిల్లలు సంరక్షణ చేయని పక్షంలో కలెక్టర్ లేదా ఆర్డీఓకు దరఖాస్తు చేసుకుంటే విచారణ జరిపి తిరిగి ఆస్తిని పొందే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో వయోవృద్ధులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. దస్నాపూర్‌లో వయోవృద్ధుల కోసం ప్రత్యేక భవనం నిర్మించి ఇంచార్జి మంత్రిచే ప్రారంభించుకున్నామని, అక్కడ డే కేర్ కేంద్రం కూడా త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల సంరక్షణ టోల్ ఫ్రీ నంబర్ పోస్టర్‌ను ఆవిష్కరించి, పలువురు వయోవృద్ధులను మెమెంటోలతో సన్మానించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పరిశీలించి వైద్యులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.



హాజరైన ప్రజలు

ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, వయోవృద్ధుల సమైక్య సభ్యులు దేవిదాస్, లక్ష్మారెడ్డి, అధికారులు, వైద్యులు, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థలఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు.






వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఓటర్ జాబితా తయారీ పై రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, త్వరలో గ్రామ పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపిటిసి ఎన్నికల నిర్వహించనున్న నేపధ్యంలో సజావుగా ఎన్నికలు జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 3 విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా, ప్రతి ఫేజ్ లో ఏ మండలాల్లో ఎన్నికలు జరగాలో ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. పాత పద్ధతిలో రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నందున, సెప్టెంబర్ 2న విడుదల చేసిన పంచాయతీ తుది ఓటర్ జాబితా సంబంధించి ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించి నవంబర్ 22 లోపు పరిష్కరించాలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. నవంబర్ 23న ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించి పోలింగ్ కేంద్రాలు, ఫోటోలతో కూడిన ఓటర్ జాబితా ప్రచురణ పూర్తి చేసేందుకు సంసిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జడ్పీ సీఈవో రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల కోసమే కార్డన్ సెర్చ్..

బజార్ హాత్నూర్ : అమృత్ తెలంగాణ: శాంతిభద్రతల పరిరక్షణ కోసం కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చందు నాయక్ తండ గ్రామంలో తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ ద్వారా ప్రతి ఇంటినీ పోలీసులు తనిఖీలు నిర్వహించి. శాంతిభద్రత పరిరక్షణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాలలో శాంతి భద్రతల కోసం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహించామని తెలిపారు. గ్రామంలో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు సరైన పత్రాలు అందజేసి వాహనాలు తీసుకెళ్లాలని, ఎవరైనా గంజాయి పండించిన అమ్మిన పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్డన్ సెర్చ్ లో అనుమానస్పద బైకులు 29, ఐదు ఆటో లను స్వాధీనం చేసుకొని పరిశీలించగా రెండు ద్విచక్ర వాహనాలపై డిడి కేసులు, రెండు బైకుల సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా 84 ద్విచక్రహనాల పై పెండింగ్ లో ఉన్న చాలన్ రూపాయలు 23 వేల 985 చెల్లించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ గురుస్వామి, ఎస్సై సంజయ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ స్పష్టమైన లక్ష్యాన్ని నిర్ధారించుకొని ఉన్నతంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్



హాజరైన విద్యార్థి విద్యార్థులు

అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి గురువారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చదవడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సాధించవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు గ్రూప్ స్టడీ చేయడం వల్ల పోటీ పరీక్షల్లో విజయం సులభతరం అవుతుందని సూచించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ ప్రాంగణంలోని రీడింగ్ రూమ్ పనులను వేగవంతం చేసి త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఐటిడిఏ ఉట్నూర్‌లో గ్రంథాలయ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని, అలాగే జిల్లా కేంద్రంలో నూతన గ్రంథాలయ భవనం నిర్మాణం కోసం కూడా ప్రతిపాదనలు పంపనున్నట్లు వెల్లడించారు. తాంసి, బీంపూర్, లక్ష్మీపూర్ మండలాల్లో ఇప్పటికే పబ్లిక్ రీడింగ్ రూమ్‌లను ప్రారంభించడం జరిగిందని చెప్పారు. కలెక్టర్‌గా సుమారు 21 నెలలుగా ఆదిలాబాద్ జిల్లాలో పనిచేస్తున్నానని, ఈ జిల్లా తనకు గోల్డెన్ మూమెంట్స్‌ను అందించిందని భావోద్వేగపూరితంగా తెలిపారు. పాఠకులందరికీ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య మాట్లాడుతూ, గ్రంథాలయాన్ని డిజిటల్ గ్రంథాలయంగా మార్పు చేస్తే పాఠకులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని, ఆ దిశగా కృషి చేస్తానని అన్నారు ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు మాట్లాడుతూ, తాను ఇక్కడే గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యానని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కి ఆదిలాబాద్ జిల్లాపై ప్రత్యేక అభిమానం ఉందని, జిల్లా గ్రంథాలయం అభివృద్ధికి కొత్త ప్రతిపాదనలు పంపితే నూతన భవన నిర్మాణానికి తనవంతు సహకారం అందించి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తానని పేర్కొన్నారు. అంతకుముందు సామల సదాశివ మాస్టర్ చిత్రపటాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే, చైర్మన్ ఆవిష్కరించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు.





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. బాలల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల, భుక్తాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన అవసరమని, తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవడం వంటి చిన్న అలవాట్లు కూడా పెద్ద మార్పులు తీసుకొస్తాయని పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు బాలల దినోత్సవ వారోత్సవాలు నిర్వహించామని వివరించారు. గతంలో రాగి, జొన్న వంటి పౌష్టికాహారాన్ని పెద్దవాళ్లు ఎక్కువ తీసుకునేవారని, ప్రస్తుతం పిల్లల్లో పోషకాహార లోపం పెరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మాయిల్లో పీరియడ్స్ కారణంగా అనీమియా ఎక్కువగా కనిపిస్తోందని, ఇందుకు ఐరన్ మాత్రలను ప్రభుత్వం అందిస్తున్నదని చెప్పారు. పాఠశాల మెనూ లో తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని చేర్చాలని సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఇంగ్లీష్ నేర్చుకోవడంలో పిల్లలు ముందుకు రావాలని అన్నారు. పదవ తరగతి విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. మంచి ర్యాంకులను సాధించేందుకు క్రమశిక్షణతో చదవాలని సూచించారు. సోషల్ మీడియా దూరం పాటించి, మొబైల్ వినియోగాన్ని తగ్గించాలని విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. పాఠశాలల్లో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయాలని, సైబర్ క్రైమ్‌ల నుంచి జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. వ్యక్తిగత వివరాలను ఎవరితోనూ పంచుకోవొద్దని, ఇలాంటి ప్రయత్నాలు జరిగితే వెంటనే తల్లిదండ్రులకు సమాచారమివ్వాలని చెప్పారు. అనంతరం ప్రశంస పత్రాలను విద్యార్థులకు అందజేశారు. బాల్య వివాహాల నిర్మూలనపై కలెక్టర్ విద్యార్థుల నుండి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సంతకాల సేకరణ బోర్డుపై సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, డీసీపీఓ రాజేంద్రప్రసాద్,

ప్రతినిధులు వెంకటస్వామి, ప్రధానోపాధ్యాయులు సమీర్, సెక్టోరల్ అధికారి ప్రత్యూష, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పంటల కొనుగోళ్లు పకడ్బందీగా సాగాలి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : జిల్లాలో పంటల కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంటల కొనుగోలు ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వరి, సోయా, పత్తి, మొక్కజొన్న పంటల కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించి కొనుగోళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు 14,760.56 క్వింటాళ్ల వరి ధాన్యం, 5,746 క్వింటాళ్ల సోయా, 7,715 క్వింటాళ్ల మొక్కజొన్న, 66,140 క్వింటాళ్ల పత్తి పంటను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. తగు తేమ శాతం వచ్చిన తరువాతే రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం సీసీఐ ద్వారా ఎకరానికి 7 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తుందని తెలిపారు. 7 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చిన రైతులు తమ వివరాలను మండల వ్యవసాయ అధికారుల ద్వారా నమోదు చేయించి, పంట ఉత్పత్తి పరిశీలన చేపట్టించుకోవాలన్నారు. ఆ వివరాలను కొనుగోలు కేంద్రాలకు అధికారులు అందజేస్తారని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 351 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యానికి వంద శాతం ట్యాబ్ ఎంట్రీలు పూర్తిచేయాలని, ప్రతీ కేంద్రంలో ప్యాడి క్లీనర్లను ఉపయోగించాలని సూచించారు. కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంటల కొనుగోలులో రైతులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అన్ని కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. పత్తి రైతుల సౌకర్యార్థం 1800 599 5779 టోల్ ఫ్రీ నెంబరు, 88972 81111 వాట్సాప్ నెంబర్లు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారి రాజేందర్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ సుధాకర్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, మార్కెటింగ్ అధికారి గజానంద్‌తో పాటు సిసిఐ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలపై అవగాహన..

ముధోల్ :అమృత్ తెలంగాణ: రాజీవ్ విద్య యోజన పథకంలో భాగంగా ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలకు 9వ,10వ ఎస్సి విద్యార్థులు దరఖా చేసుకోవాలని ఎడ్ బిడ్, ముధోల్ వసతి గృహ సంక్షేమ శాఖ అధికారులు ఆర్, నగేష్, శారద లు అవగాహన కల్పించారు. గురువారం ముధోల్ తానూరు మండలంలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9, పదో తరగతి చదువుతున్న ఎస్సి విద్యార్థులు ప్రీ మెట్రిక్ ఉపకర వేతనాలకు దరఖాస్తులు చేసుకునేలా ప్రధాన ఉపాధ్యాయులు ప్రోత్సహించలని కోరారు. ఆయా పాఠశాలలు సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు తగిన గడువు సమయంలో దరఖా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులుతదితరులు ఉన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు చోటుచేసుకోకుండా అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని స్పష్టం చేశారు.







వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మరియు ఎస్పీ జానకి షర్మిల

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు చోటుచేసుకోకుండా అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ ఎన్నికల సమాయత్తాలపై గురువారం ఆమె హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా రాణి కుముదిని మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి శాఖ పెద్దపీట వేశాలన్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, రిజర్వేషన్ల కేటాయింపు, శాంతిభద్రతల బందోబస్తు వంటి అంశాలపై అధికారులు ఒకటికి రెండుసార్లు పరిశీలనలు చేయాల్సిన అవసరాన్ని ఆమె గుర్తుచేశారు. ఎన్నికలను మూడు విడతలలో నిర్వహించే దిశగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు పని చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితాను వెంటనే పంపించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు యథావిధిగా కొనసాగుతున్నాయని, అధికారులు ప్రతి అంశాన్ని పర్యవేక్షిస్తూ ఎటువంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, జెడ్పి సీఈవో గోవింద్, డిపిఓ శ్రీనివాస్, పంచాయతీ రాజ్, పోలీసు, రెవెన్యూ శాఖలకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఖేలో ఇండియా (అస్మిత) ఎంపిక పోటీల గోడప్రతులను విడుదల చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.




పోస్టులను ఆవిష్కరిస్తున్న నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రేపటి నుంచి జిల్లాలో నిర్వహించబోయే బాలికల అండర్ 14, అండర్ 16 ఖేలో ఇండియా ఖేలో ఇండియా జిల్లా స్థాయి ఎంపిక పోటీలు రేపటి నుంచి నిర్వహించనున్నారు. ఈ ఎంపిక పోటీలకు సంబంధించి గోడప్రతులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం సాయంత్రం తన ఛాంబర్లో విడుదల చేశారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థుల్లో నైపుణ్యాలు దాగి ఉన్నాయని, ఇటువంటి పోటీల ద్వారా వాటిని వెలికి తీయాలని అన్నారు. ఎంపిక పోటీలు పగడ్బందీగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ ఎంపిక పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ శ్యాముల్, ఎస్జిఎఫ్ సెక్రటరీ రవీందర్ గౌడ్, గిరిప్రసాద్, తదితరులు ఉన్నారు.

## కంటి ఆపరేషన్ వికటించి ఒకరు మృతి.....

నిర్మల్ జిల్లా నవంబర్ 19 అమృత్ తెలంగాణ తెలంగాణ ప్రతినిధి తూరటి గ్రామానికి చెందిన బోద్కర్ నారాయణ వయసు 68 గత నాలుగు నెలల క్రితం కంటి ఆపరేషన్ చేసుకున్నారు. అప్పటినుండి ఆపరేషన్ అయినను తన కండ్లు కనిపించలేవని మరియు నరాలు నొప్పి పెడుతున్నాయని మరియు వృద్యప్పా రీత్యా జీవితంపై విరక్తి చెంది తేదీ 18 11 2025 రోజున తెల్లవారుజామున తన ఇంట్లో ఏదో గుర్తుతెలియని పురుగుల మందు తాగగా వెంటనే తన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిర్మల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈరోజు సాయంత్రం ప్రభుత్వ హసుపత్రి యందు మరణించినాడు అని తన కుమారుడు బోర్డర్ శ్రీకర్ పోలీస్ స్టేషన్ నర్సాపూర్ జి యందు దరఖాస్తు ఇవ్వగా ASI శంకర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టినారు.



మృతి చెందిన వ్యక్తి

## తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో "కేంద్ర ముసాయిదా విత్తన చట్టం 2025" పై తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు సుంకెట అన్వేష్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు సంఘాల సమావేశం నిర్వహించడం జరిగింది.



సమావేశానికి హాజరైన బోరంచు శ్రీకాంత్ రెడ్డి



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు సంఘాల ప్రతినిధులతో దృశ్యం

అమృత్ తెలంగాణ హైదరాబాద్ న్యూస్ తెలంగాణా కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో "కేంద్ర ముసాయిదా విత్తన చట్టం 2025" పై తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు సుంకెట అన్వేష్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు సంఘాల సమావేశం నిర్వహించడం జరిగింది. హైదరాబాద్ లోని తెలంగాణ సీడ్ కార్పోరేషన్ ఆఫీసు హాల్ లో జరిగిన ఈ సమావేశానికి ,,ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి రైతు సంఘాల నేతలు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా చట్టం అమలు, దానిలోని లోపాలు, మార్కెట్లో విత్తనాల నాణ్యతను నియంత్రించడం, రైతులకు సరసమైన ధరలకు అధిక దిగుబడి విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడటం, నకిలీ లేదా నాణ్యత లేని విత్తనాల అమ్మకాలను అరికట్టడం, నష్టాల నుండి రైతులను రక్షించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, విదేశీ విత్తన రకాలను అందించటానికి విత్తనాల దిగుమతులను సరలీకరించడం, రైతుల హక్కులను కాపాడటం, విత్తన సరఫరా గొలుసులలో పారదర్శకత, జవాబుదారీతనం నిర్ధారించడం పై రైతు సంఘాల ప్రతినిధులు చర్చించడం జరిగింది. అనంతరం సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ని కలిసి విత్తన చట్టం లోని లోపాలు, తద్వారా రైతులు ఎదుర్కొనే సమస్యలను వివరించడం జరిగింది. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రిగారు చట్టం లోని లోపలపై పూర్తి స్థాయిలో విశ్లేశించి సలహాలను సూచనలను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ని మర్యాద పూర్వకంగా కలిసి అభినందించి శుభాకాంక్షలు తెలిపిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్

అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ జిల్లాలో జల సంరక్షణ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినందుకు గుర్తింపుగా ఆదిలాబాద్ జిల్లా సౌత్ జోన్‌లో మొదటి స్థానం సాధించింది మంగళవారం న్యూఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్మ్ము చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు జిల్లాకు లభించిన ఈ జాతీయ స్థాయి గుర్తింపు పట్ల ఆయన క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ని మర్యాద పూర్వకంగా కలిసి అభినందించి, శుభాకాంక్షలు తెలిపి ఆనందం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు



కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఆడే గజేందర్

## ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలను అందజేసిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు

కోరుట్ల అమృత్ తెలంగాణ నవంబర్ 20: పట్టణ సినారె భవన్లో గురువారం కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు విచ్చేసి కోరుట్ల మండలానికి సంబంధించిన 40 ఇందిరమ్మ ఇండ్లను ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు ప్రోసిడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు త్వరగా చేపట్టుకోవాలని నిర్మాణం ఏ విధంగా జరిగితే ఆ విధంగా ఆ ఇంటి యజమాని ఖాతాలో డబ్బులు జమవుతాయని నిర్మాణాలు త్వరగా చేపట్టాలని సూచించారు.కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతంలో కోరుట్ల పట్టణానికి 500 ఇండ్లు కోరుట్ల మండలానికి 502 ఇండ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు గతంలో ఇంటి నిర్మాణాలు చేపట్టుకోవడానికి ఎవరు ముందుకు వచ్చేవారు కారని ఇప్పుడు ఇంటి నిర్మాణం ప్రకారం డబ్బులు అకౌంట్స్ లో పడుతున్నాయి కాబట్టి అందరూ ముందుకు వస్తున్నారు అన్నారు.కాంగ్రెస్ ఎప్పటికీ ప్రజా ప్రభుత్వం ప్రజల కోసమే పని చేసే ప్రభుత్వం అన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రొజిడింగ్ పత్రాలు అందజేసిన జువ్వాడి నర్సింగరావు

## బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క



అమృత్ తెలంగాణ ఉట్నూర్ న్యూస్ : ఉట్నూర్: ఉట్నూర్ మండలం పరిధిలో పలువురు బాధిత కుటుంబ సభ్యులను టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క గురువారం పరామర్శించారు.ఇటీవల జగిత్యాలలో ప్రమాదవశాత్తు జారిపడి రెండు చేతులు ఫ్యాక్చర్ అయిన ఉట్నూర్ మండలం ఎక్స్ రోడ్‌కు చెందిన జెసిబి డ్రైవర్ రాథోడ్ సంజీవ్ ఇంటికి వెళ్లి ఆయన పరిస్థితిని ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అదే విధంగా, ఉట్నూర్ మండల కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జాదవ్ ప్రేమ్ సింగ్ కుమారుడు సాయికిరణ్ గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న సుగుణక్క, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.సుగుణక్క వెంట నాగపూర్ మాజీ సర్పంచ్ సునిల్ జాదవ్,లక్ష్మణ్,దినేష్,లక్ష్మణ్ తదితరులు ఉన్నారు

## సైబర్ నేరాలు,గంజాయి పై అవగాహన కార్యక్రమం

కోరుట్ల రూరల్ అమృత్ తెలంగాణ నవంబర్ 20: కోరుట్ల మండలం మోహన్ రావు పేట గ్రామంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు బీర్పూర్ పోలీస్ కళాబృందం సైబర్ క్రైమ్, గంజాయి నిర్మూలన, మూఢ నమ్మకాలు, ఆత్మహత్యల నివారణ, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, గల్ఫ్ ఏజెంట్ల మోసాలు, సైబర్ మోసాలు, సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించింది. ఎస్ఐ చిరంజీవి మాట్లాడుతూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, మోసపోతే 1930కి ఫిర్యాదు చేయాలని, గ్రామాలన్నింటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, వాహనదారులు తాగి డ్రైవింగ్ చేయవద్దని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని, హెల్మెట్ ధరించాలని సూచించారు. గ్రామంలో సమస్యలుంటే పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలని కోరారు



# అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్





జగిత్యాల రూరల్ అమృత్ తెలంగాణ నవంబర్ 20: మండలం జాబితాపూర్ గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు 18 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ గురువారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ముస్కు ఎల్లారెడ్డి, పెండెం నాగలక్ష్మి రాములు, ఎంపీడీవో రమాదేవి, డీఈ మిలింద్, ఎంపీవో రవి బాబు, ఏఈ రాజమల్లయ్య, మాజీ సర్పంచ్ అంకం సతీష్, సీనియర్ నాయకులు బాల ముకుందం, నక్కల రవీందర్ రెడ్డి, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఏ పార్టీలో ఉన్నాడో చెప్పాలి.

## బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు: కల్వకుంట్ల విద్యాసాగర్ రావు



జగిత్యాల అమృత్ తెలంగాణ నవంబర్ 20: జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్ రావు, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే బీఆర్ఎస్ లో ఉంటే 24 గంటల్లో కండువా కప్పుకోవాలని ఆయన సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పి చైర్ పర్సన్ వసంత, బీఆర్ఎస్ శ్రేణులు కూడా పాల్గొన్నారు.

# ఒక బీసీ మహిళకు న్యాయం జరిగేదెప్పుడో?

**మహిళకు మద్దతుగా మాజీ ఎంఎల్ఏ విద్యా సాగర్ రావు.**

**తగిన న్యాయం జరగకపోతే మహిళలతో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతాం..మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత..**

మల్లాపూర్ అమృత్ తెలంగాణ నవంబర్ 20 మల్లాపూర్ మండలం రేగుంట గ్రామంలో ఇనుగుర్తి సరిత అనే మహిళ తనకు జరిగిన అన్యాయం పై నిరాహార దీక్షకు దిగి పది,పదిహేను రోజులు అవుతున్న ,తనకు ఎవరివల్ల అన్యాయం జరిగిందో ఇప్పటి వరకు అధికారులు గానీ ,పోలీసు వ్యవస్థ గానీ తగిన న్యాయం చేయకపోవడం ప్రభుత్వ అసమర్థత అని సరితకు మద్దతుగా వచ్చిన బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎంఎల్ఏ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు.అధికారులు పద్ధతి మార్చుకొని సరితకు తగిన న్యాయం చేయాలన్నారు. ఏ రోజైతే అర్ధరాత్రి ఒంటరిగా ఒక ఆడది నడిచి వెళ్తుందో, ఆ రోజే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్టు అని గాంధీగారు అన్నారు.కానీ పట్టపగలు ఆమహాత్ముని విగ్రహం ముందు ఒక బి సి మహిళ పదిహేను రోజులనుండి నిరాహార దీక్ష చేస్తున్న కూడా పట్టించుకోని ప్రభుత్వం,ఇది ప్రజా ప్రభుత్వమా?అని అక్కడికొచ్చిన ప్రజలు భావిస్తున్నారు . సరితను విధుల నుండి తొలగించడమే కాకుండా తనకు మద్దతు తెలిపిన వారిని భయ భ్రాంతులకు గురిచేస్తున్నవారినిశిక్షించి సరితకున్యాయం చేయాలని లేదంటే మహిళలతో కలిసి వెళ్ళి కలెక్టర్ కార్యాలయంఎదుట ధర్నాకు దిగుతామని జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్దావ వసంతఅన్నారుమహిళకు మద్దతుగా మాజీ ఎంఎల్ఏ కల్వకుంట్ల విద్యా సాగర్ రావు,మాజీ జడ్పీచైర్ పర్సన్ దావ వసంత , జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్,బిఆర్ఎస్మండల ప్రెసిడెంట్ తోట శ్రీనివాస్, మొగిలిపేట మాజీ సర్పంచ్ వనతడుపుల నాగరాజు,మరియు బిఆర్ఎస్ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# మల్లాపూర్ మార్కెట్ యార్డు ను సందర్శించిన మాజీ ఎంఎల్ఏ కల్వకుంట్ల విద్యా సాగర్ రావు.




మల్లాపూర్ అమృత్ తెలంగాణ నవంబర్ 20 మల్లాపూర్ మండలం లోని వ్యవసాయ మార్కెట్ యార్డులు సందర్శించిన మాజీ ఎంఎల్ఏ విద్యా సాగర్ రావు రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు . వారం రోజుల గా మ్యాచర్ యార్డుకు రాకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్న రైతుల సమస్యలు డీఎం తో మాట్లాడి కొనుగోలు వేగవంతం చేయించారు మొక్క జొన్న కొనుగోలులో జాప్యం జరుగుతుందని , రైతులకు సరైన సమయం లో తగినన్ని బస్తాలు ఏర్పాటు చేసి ,ధరల విషయంలో తూకం విషయంలో పారదర్శకత పాటించాలని ,తూకం వేసిన ధాన్యాన్ని సరైన సమయంలో తరలించి రైతులకు ఇబ్బంది కాకుండా చూడాలని అధికారులకు సూచించారు రైతుల పట్ల నిబద్ధత కలిగిన ప్రభుత్వం త్వరలోనే వస్తుందని అన్నారు . సరైన సమయంలో రైతులకు ఎరువులందించని ఈ ప్రభుత్వం కనీసం పండిన పంటనైన సరైన సమయం లో కొనాలని ప్రభుత్వాన్ని కోరారు ఇప్పటికీ మక్కలే పోలేదు . మరి వరి ధాన్యం ఎక్కడ పోసుకుంటారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు . గత పదేళ్ల బి ఆర్ ఎస్ పాలనలో ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలు పెట్టి రైతులకు ఎలాంటి ఇబ్బం ది కలగకుండా చూసుకున్నామన్నారు ఈ కార్యక్రమంలో పలు గ్రామాల నుండి ధాన్యం తీసుకొచ్చిన రైతులు , బి ఆర్ ఎస్ నాయకులు కార్య కర్తలు పాల్గొన్నారు

# జాతీయ రహదారిని అడ్డుకోవడం, ట్రాఫిక్ అంతరాయం

**జాతీయ రహదారిపై అత్యవసర సేవల వాహనాలు ప్రయాణిస్తూ ఉంటాయి.**

**అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు, ఆస్పత్రికి వెళ్లే వ్యక్తులకు అసౌకర్యం.**

అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి జాతీయ రహదారిపై అత్యవసర సేవల వాహనాలు ప్రయాణిస్తూ ఉంటాయని వాటిని అడ్డుకోవడం చట్ట ప్రకారం నేరంగా పరిగణించబడుతుందని ఆదిలాబాద్ డిఎస్పీ యల్ జీవన్ రెడ్డి తెలిపారు. యువత కేసుల బారిన పడకుండా వారి భవిష్యత్తులను నాశనం చేసుకోకూడదని తెలిపారు. అంబులెన్స్, అగ్నిమాపక, వాహనాలు ఆస్పత్రి లకు వెళ్లేవారికి అసౌకర్యం కలిగే చర్యలు చేయవద్దన్నారు. యువత కేసుల వల్ల ఉద్యోగ అవకాశాలను కోల్పోకుండా ఉండాలని సూచించారు.



అదిలాబాద్ డిఎస్పి జీవన్ రెడ్డి

# సీతకి వయసు తో వచ్చిన కష్టాలు పాపం..!



సీతారామం సినిమా తో తెలుగు లో ఒక్కసారిగా పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. హిందీలో ఈమె సినిమాల్లో ఎంట్రీ ఇచ్చి చాలా కాలం అయ్యింది.. అంతకు ముందే సీరియల్స్ లో కూడా ఈ అమ్మడు చాలానే పాపులారిటీని సొంతం చేసుకుంది. కానీ ప్రస్తుతం దక్కిన స్టార్ డమ్.. సూపర్ హిట్ మాత్రం ఆమెకు ఇన్నాళ్ల సినీ కెరీర్ లో దక్కలేదనే చెప్పాలి. దుల్కర్ సల్మాన్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిన సీతారామం సినిమాలో సీత పాత్రకు అచ్చు గుద్దినట్లుగా అద్భుతంగా సెట్ అవ్వడంతో ప్రతి ఒక్కరు కూడా ఫిదా అయ్యారు.. ఇంకా కూడా అవుతూనే ఉన్నారు. ప్రస్తుతం టాలీవుడ్ లో వరుసగా సినీ ఆఫర్లు దక్కించుకుంటున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో వెల్లడించిన విషయాలు ఆసక్తికరంగా మారాయి. ఒక పాత్ర కోసం వేశ్య గృహంలో ఉండాల్సి వచ్చిందని చెప్పిన మృణాల్ ఠాకూర్ కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న సవాళ్లు గురించి పలు ఆసక్తికర విషయాలను చెప్పింది. ఇదే సమయంలో ఆమె తన వయసు గురించి కాస్త అసహనంతో మాట్లాడింది. నా వయసు ప్రస్తావన వచ్చిన ప్రతి సారి కూడా చాలా మంది పెళ్లి గురించి అడుగుతూ ఉంటారని.. ప్రేమ లో పడలేదా అంటూ ఆశ్చర్యంగా ఫేస్ పెడతారు అంటూ మృణాల్ పేర్కొంది. నా వయసు 30 ఏళ్లు అంటూ చెప్పగానే మీరు పెళ్లి చేసుకోవాల్సిన సమయం వచ్చినట్లుంది.. పెళ్లి పై మీ యొక్క అభిప్రాయం అంటూ చాలా మంది ప్రశ్నలతో ముంచెత్తుతున్నారు. ఎన్నో సార్లు సమాధానం చెప్పినా కూడా ప్రేమ గురించి నన్ను ఎప్పుడూ ఎవరో ఒకరు ప్రశ్నిస్తూనే ఉన్నారు. ప్రేమ గురించి నాకంటూ ఒక అవగాహణ ఉందని మృణాల్ పేర్కొంది.

# వెబ్ సిరీస్ లో ఊర్మిళ దుమారం తప్పదా?


బాలీవుడ్ బ్యూటీ ఊర్మిళ మండోత్కర్ నాలుగేళ్లగా సినిమాలకు దూరంగా ఉంటోన్న సంగతి తెలిసిందే. అవకాశాలు రాక...సరైసనన పాత్రలు దొరకక గ్యాప్ ఇచ్చిందా? అన్నది క్లారిటీ లేదు గానీ..ఊర్మిళ తెరపై ఎప్పుడు కనిపించినా ఓ సంచలనమే అన్నది వాస్తవం. యాభైకి చేరువలోనూ ఊర్మిళ ధగధగల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వెండి తెరపై మెరిసిన అమ్మడు బుల్లి తెరపైనా తనదైన మార్క్ వేసింది. పలు రియాల్టీ షోలను హోస్ట్ చేసి ఐడెంటీ వేసింది. ప్రస్తుతం డిడ్ సూపర్ మామ్స్ సీజన్ -3రని హోస్ట చేస్తోంది. తాజాగా ఊర్మిళ వెబ్ సిరీస్ లకు సై అనేసింది. 'తివారీ' అనే వెబ్ సిరీస్ కి కమిట్ అయినట్లు తెలుస్తోంది. ఇందులో ఆమె ద్విపాత్రాభినయం చేస్తుంది. తల్లి -కుమార్తె నేపథ్యంలో సాగే స్టోరీ కావడంతో ఆ రెండు పాత్రలు కూడా ఆమె పోషిస్తుందిట. పాత్రలకు సంబంధించి ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుంటుందిట. గత ఆరు నెలలుగా అదే పనిలో బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ పాత్రల గురించి స్పందించింది. ' నాలోని నటికి తివారీ సవాల్ విసురుతుంది. ఇందులో అనుబంధాలే కాదు.. ఊహించని మలుపు యాక్షన్ సన్నివేశాలు..రొమాంటిక్ సీన్లు ఉంటాయని' రివీల్ చేసింది. మొత్తానికి ఊర్మిళ సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ గట్టిగానే ఊపేటట్లు కనిపిస్తుంది. స్టార్ హీరోయిన్ గా కొనసాగినంత కాలం బాలీవుడ్ ని ఓ ఊపు ఊపేసింది. ఆ తర్వాత ఒక్కసారిగా చల్లబడింది. కొంత కాలంగా సరైన అవకాశాలు రావడం



లేదు. ఈ క్రమంలో కొంత గ్యాప్ వచ్చింది. మళ్లీ ఇప్పుడు ఓటీటీని షేక్ చేయడానికి రెడీ అవుతోంది. ప్రస్తుతం వెబ్ సిరీస్ ల్లోకి స్టార్ హీరోయిన్లు సైతం ఎంట్రీ ఇస్తున్నారు. ఈక్రమంలో అక్కడా పోటీ వాతావరణం కనిపిస్తుంది. ఒకరికొకరు పోటీ పడుతూ సత్తా చాటుతున్నారు. వెండి తెరను మించి ఓటీటీ బోల్డ్ కంటెంట్ లో విచ్చలవిడిగా నటించడానికి ఎలాంటి అడ్డంకులు పెట్టడం లేదు. ఛాన్స్ ఇవ్వాలే గానీ.. దర్శకుడి సృతజాన్మతకని మించి పెర్ఫార్మెన్స్ ఇస్తున్నారు. మరి ఆ రకంగా ఊర్మిళ కూడా రేసులో నిలుస్తుందా? అన్నది చూడాలి. ఊర్మిళ తెలుగులోనూ అంతే ఫేమస్. ఆమె 'అంతం'..'గాయం'..'అనగనగా ఒక రోజు' లాంటి తెలుగు చిత్రాల్లో నటించిన సంగతి తెలిసిందే.

# మంచి ఆఫర్లు రాబడుతున్న 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్'

'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' సినిమా అక్టోబర్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గర పడుతుండడంతో మేకర్స్ ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ చిత్రం నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సోషల్ మీడియా సర్కిల్స్ లో మంచి సంచలనం సృష్టించింది. చిత్రాన్ని ఎక్కువ మంది ప్రేక్షకులను చేరుకోవడానికి మేకర్స్ తమ ప్రయత్నాలను రెట్టింపు చేస్తున్నారు. ఇంతకుముందు విడుదల చేసిన క్రేజీ ట్రైలర్ మరియు ప్రమోషనల్ సాంగ్ సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేశాయి. ఇది బయ్యర్ల నుండి మంచి ఆఫర్లు రావడానికి దోహదపడినట్లు సమాచారం. 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' చుట్టూ నెలకొన్న హైప్ దృష్ట్యా ఈ సినిమా ఆంధ్ర నైజాం మరియు సీడెడ్ ఏరియాలకు బయ్యర్లు సుమారు 3 కోట్ల కోట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. యునిక్ కాన్సెప్ట్.. ప్రత్యేకమైన కథనం ప్రేక్షకులకు విభిన్నమైన



అనుభూతిని ఇస్తుందని సినీ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా సినిమా ప్రీ క్లైమాక్స్ పార్ట్ ఎప్పుడూ చూడని ఎమోషన్స్ తో ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉందని అంటున్నారు. అలాగే సంగీతం సినిమాటోగ్రఫీ మరియు క్రిస్పీ ఎడిటింగ్ ప్రేక్షకులను కట్టిపడేస్తాయని పేర్కొంటున్నారు. దీన్ని బట్టి చూస్తే 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' సినిమా మంచి బిజినెస్ డీల్ తో ముగించే అవకాశం ఉందని అనుకోవచ్చు. సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ లో విశ్వంత్ - మాళవిక సతీషన్ హీరోహీరోయిన్లుగా నటించారు. ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్స్ మరియు స్వస్తిక సినిమా బ్యానర్స్ పై నిరంజన్ రెడ్డి - వేణు మాధవ్ పెద్ది సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు.






ఈశాన్యామహేశ్వరి హాట్ ఇన్ రెడ్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com